క్లుప్తంగా

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధనలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళ వారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారా ధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



బిర్లా జంక్షన్‌లో వాహనాల పత్రాలు పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మర్రిపాలెం : కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. నిబంధనలు పాటించకుండా, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వాహనదారుల దస్త్రాలు మంగళవారం ఉదయం బిర్లా జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఎస్ఐ, సిబ్బంది పరిశీలించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారిని, ట్రిపుల్ రైడింగ్ చేసిన వారిని హెచ్చరించారు. ఆటోలను కూడా తనిఖీ చేశారు.

ఘనంగా కుంచుమాంబ మారువారం



కుంచుమాంబ ఆలయం వద్ద అన్నదానంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెం జగన్నాథపురంలో మూడు గుళ్ల వద్ద కొలువైన కుంచుమాంబ అమ్మవారి మారువారం పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి తెల్లవారుజామున అభిషేకాలు, కుంకుమ పూజలు జరిపించారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం మధ్యాహ్నం ఆలయం వద్ద మహా అన్నదానం ఏర్పాటు చేయగా సుమారు 3 వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు పాలమరశెట్టి ప్రసాద్, అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి ఆడారి పారుపల్లి రవి, కోశాధికారి పెంటకోట సత్యప్రసాద్, ఉత్సవ కమిటీ చైర్మన్ రాజగిరి సింహాచలం, పిల్లా గోపి, రాజగిరి అప్పలరాజు, కర్రి అచ్యుతరావు, టి.టి. శివ, మాలి నాయుడు, పద్మ, ఉమ, కుమారి పాల్గొని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారం

పెదగంట్యాడ: మాదకద్రవ్యాలతో అన్నీ అనర్థాలేనని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వై.లక్ష్మీనాయుడు అన్నారు. వాటికి అలవాటు పడి, భవిష్యత్తును అంధకారంలోకి నెట్టవద్దని హితవు పలికారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఎవరైనా మత్తు పదార్థాలు తీసుకున్నా, విక్రయించినా వెంటనే 14500 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

డెంగ్యూ.. ఈ పదం వింటేనే విశాఖ వాసి గజగజలాడిపోతున్నాడు. కానీ భయం అవసరం లేదంటూ అభయాన్నిస్తున్నాయి వైద్య వర్గాలు. సీజనల్ వ్యాధుల్ని కట్టడి చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది వైద్య ఆరోగ్య శాఖ. జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు ప్రజల్ని అప్రమత్తం చేసే దిశగా క్షేత్రస్థాయి అవగాహనకు నడుం బిగించింది.



- భయపెడుతున్న సీజనల్ వ్యాధులు
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ

దాబాగార్డెన్స్: మున్సిపల్, వైద్యారోగ్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై ఇంటింటి ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. తాగునీటి నుంచి పారిశుధ్య నిర్వహణ వరకు ప్రత్యేక చర్యల్ని వివరించే ప్రయత్నం చేస్తున్నాయి. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ ప్రభావిత ప్రాంతాల్లో మొబైల్ టీమ్‌లు సర్వేలు నిర్వహిస్తున్నాయి. వార్డు స్థాయిలో సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. దోమల నివారణపై ఏం చేయాలో సూచిస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే సీజనల్ వ్యాధులపై జిల్లా వైద్య శాఖ యుద్ధం ప్రకటించింది.



వ్యాధులకు మూలం.. ఈ చెత్త

దోమకాటుతో.. డెంగ్యూ..

- డెంగీకారక దోమ పగటి పూట మాత్రమే కుడుతుంది
- ఉదయం పూట జాగ్రత్తగా ఉండాలి
- దోమ కుట్టిన వారం తర్వాత ఒక్కసారిగా తీవ్ర జ్వరం వస్తుంది
- ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి కలుగుతుంది
- నోరు ఎండిపోవడం, అధిక దాహం, ఒళ్లు నొప్పులు, శరీరంపై ఎర్రటి దద్దుర్లు, నాడి నెమ్మదిగా కొట్టుకోవడం, రక్తపోటు నమోదు పడిపోవడం మొదలైన లక్షణాలు కనిపిస్తాయి.
- వాంతులు, వికారం, రక్తంతో కూడిన మలవిసర్జన, కడుపునొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి.

దోమను ఇలా గుర్తించండి..

నల్లగా ఉండే ఈ దోమపై తెల్లని మచ్చలు ఉంటాయి. పగటిపూట ఎక్కువగా సంచరిస్తుంది. మూతల్లేని నీటి ట్యాంకులు, రోడ్లపై నిలిచే నీరు, పాత టైర్లు, ఇళ్లలోని రిఫ్రిజరేటర్లు, కూలర్లలో నిల్వ ఉండే నీటిలో డెంగీకారక దోమ వృద్ధి చెందుతుంది.

తీసుకోవల్సిన జాగ్రత్తలు..

- వ్యాధి నివారణకు ప్రధానంగా దోమలను నిర్మూలించాలి.
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

డయేరియా..

- కలుషిత నీరు, నిల్వ ఉంచిన ఆహారం తీసుకోవడం వలన వ్యాధి సోకుతుంది.
- వ్యాధి సోకిన వారికి నీళ్ల విరేచనాలు అవుతాయి
- జ్వరం కూడా వచ్చే అవకాశం ఉంది
- రోజులో నాలుగు నుంచి ఐదుసార్లు విరేచనాలు అయితే డయేరియాగా గుర్తించాలి
- ఎక్కువసార్లు విరేచనాలు అవడం వల్ల శరీరంలోని నీరు, లవణాలు, పొటాషియం, గ్లూకోజ్ శాతం తగ్గి రోగి నీరసపడతాడు. అంతే కాకుండా రక్తపోటు తగ్గిపోవడంతో పాటు, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ఏం చేయాలి..

- చిన్న పిల్లల్ని డయేరియా సోకిన రోగికి దూరంగా ఉంచాలి
- ఈ వ్యాధి చిన్నారులు, మధుమేహ రోగులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిపై తీవ్ర ప్రభావం చూపుతుంది
- వ్యాధి సోకిన వ్యక్తికి కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలి
- ఈ సీజన్‌లో సాధ్యమైనంత వరకు బయటి ఆహారం తినకూడదు
- నిల్వ ఉంచిన ఆహారం జోలికి వెళ్లొద్దు.



జోన్-4 పరిధిలో గల డంపింగ్ యార్డ్

మలేరియా..

- ఈ వ్యాధికి కారణమయ్యే దోమలు మురుగు కాల్వల్లోని నీటిలో వృద్ధి చెందుతాయి
- దీనిని సకాలంలో గుర్తించి చికిత్స చేయకుంటే ప్రమాదకరం
- మనిషి లివర్, కిడ్నీ, గుండె, రక్తనాళాలు, మెదడుపై ప్రభావం చూపే అవకాశం
- ఒక్కో సమయంలో రోగి ప్రాణాపాయ స్థితికి చేరి, కోమాలోకి వెళ్లే అవకాశం కూడా ఉంది.

గుర్తించేదెలా..

- దోమ కుట్టిన 10 నుంచి 14 రోజుల్లో మలేరియా వ్యాధి లక్షణాలు బయటపడతాయి
- రోజు విడిచి రోజు జ్వరం వస్తుంది.
- తలనొప్పి, ఒంటి నొప్పులు, చలి ఎక్కువగా ఉంటాయి
- చెమటలు పట్టడం, కొన్ని సార్లు వాంతులు కూడా అవుతాయి
- రక్త పరీక్ష చేసిన వెంటనే మలేరియా క్రిములు కనబడవు. శరీరంలోకి ప్రవేశించిన తర్వాత కొద్ది రోజులకు మాత్రమే ఇవి రక్త పరీక్షల్లో బయటపడతాయి. ఈ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి.
- రోగ కారకాలు మెదడు మీద ప్రభావం చూపితే సెరిబ్రల్ మలేరియాకు దారితీసే అవకాశం ఉంది.
- సెరిబ్రల్ మలేరియా ప్రాణాంతకం. ఈ విషయంలో చిన్నారులు జాగ్రత్త.

విషజ్వరం..

వాతావరణంలో మార్పులు, కొన్ని రకాల వైరస్‌ల కారణంగా వైరల్ ఫీవర్ వస్తుంది. కుటుంబంలో ఒకరికి విషజ్వరం వస్తే మిగిలిన వారికి కూడా వచ్చే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. దీని ప్రభావం వారం నుంచి పది రోజుల వరకు ఉంటుంది. గొంతు నొప్పి, ఆకలి మందగించడం, జలుబు, తలనొప్పి, ఒంటి నొప్పుల వంటి లక్షణాలు కనిపిస్తాయి.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం..

రాబోయేది వర్షాకాలం. ఆ సమయంలో దోమల వ్యాప్తి అధికంగా ఉంటుంది. ముఖ్యంగా కీటక జనిత (దోమల ద్వారా) సంభవించే మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, బోధకాలు వ్యాధి వంటివి రాకుండా కాపాడుకోవాలి. ఇంటి పరిసరాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి. వేడి ఆహారాన్నే తీసుకోవాలి. బయటి ఆహారాన్ని తీసుకోకపోవడమే మేలు.

–డాక్టర్ పి. జగదీశ్వరరావు,
జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలి..

ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. మురుగు కాల్వల్లో చెత్త, చెదారం వేయకుండా, మురుగు నీరు ప్రవహించే విధంగా చూడాలి. కుళాయిల లీకేజీ అరికట్టాలి. ఎయిర్ కూలర్‌లో నీటిని వారానికి ఓసారి మార్చాలి. దోమల బెడద తగ్గాలంటే మురుగు నీరు నిల్వ ప్రాంతాల్లో కిరోసిన్, ఆయిల్ చల్లాలి. ఫ్రైడే డ్రైడే పాటించాలి. పూల కుండీలు, ఇంటి పైకప్పుల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.

– తులసి, మలేరియా అధికారి

ప్రమాదమని తెలిసినా..

ఆర్టీసీ సబ్‌వే గుండా రాంగ్ రూట్‌లో ప్రయాణాలు

సీతమ్మధార: ఆశీలమెట్టలోని సబ్ వేలో రెండు వైపుల వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. స్టాపర్లు ఉన్నప్పటికీ లారీలు, ఆటోలు, బస్సులు రాకపోకలు సాగించటంతో మంగళవారం ట్రాఫిక్ జామ్ అయింది. జగదాంబ నుంచి ఆశీలమెట్టకు వచ్చిన ఆర్టీసీ బస్సు కండక్టర్ స్టాపర్ తీసి మరీ లోపలికి ప్రవేశించడంతో రామా టాకీస్ వైపు నుంచి వచ్చే వాహన చోదకులు కొద్ది సేపు ఆగిపోవలసి వచ్చింది. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రామాటాకీస్ వైపు వెళ్లే బస్సులు సబ్ వే కింద నుంచి వెళ్తాయి. గతంలో ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడంతో అప్పటి పోలీస్ కమిషనర్ మహేష్‌చంద్ర లడ్డా ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. తర్వాత మద్దిలపాలెం నుంచి కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలు సాగేవి. గత పది రోజులుగా పోలీసులు లేకపోవడంతో రెండు వైపుల భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ విషయాన్ని పోలీసులు, జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



రాంగ్‌రూట్‌లో సబ్‌వేలోకి ప్రవేశిస్తున్న వాహనాలు

రోడ్డును ఆక్రమించి.. జోరుగా వ్యాపారాలు

పాదచారులు.. వాహన చోదకుల అవస్థలు

సీతమ్మధార: జీవీఎంసీ జోన్–3 పరిధిలో జోరుగా ఆక్రమణలు సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. 27వ వార్డు ద్వారకానగర్‌లో ఇప్పటికే పలు ఫుట్‌పాత్‌ల ఆక్రమణల కారణంగా పాదచారులు తీవ్ర అవస్థలు పడుతుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇక్కడి డైమండ్ పార్కు ఎదురుగా రోడ్డును ఆక్రమించి పార్లర్ నిర్వహించటం గమనార్హం. రండి బాబు రండి వేడి వేడి బిర్యానీ అంటూ సిబ్బంది వినియోగదారులను పిలుస్తూ అబిడ్స్ పేరిట పార్లర్ నిర్వహిస్తున్నారు. దుకాణం అద్దె లేదు.. రోడ్డును ఆక్రమించి నిర్వహిస్తున్నారు కనుక రేట్లు తక్కువగా ఉంటాయనుకుంటే పొరపాటు పడినట్టే. ఇక్కడ ధమ్ బిర్యానీ ధర రూ.150. ఇతర వంటకాల ధరలు కూడా భారీగానే ఉన్నాయి. ఇక్కడికి సమీపంలోనే జోనల్ కార్యాలయం ఉన్నా సరే టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవటం లేదని పలువురు విమర్శిస్తున్నారు. రోడ్డును ఆక్రమించి పార్లర్ నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్ జామ్ అవుతోందని, పాదచారులు సైతం ఇక్కట్లు పడుతున్నారని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో ఇంకొందరు కూడా ఫుట్‌పాత్‌లు, రోడ్డు మీదే రెస్టారెంట్లు నిర్వహిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జోన్–3 టౌన్‌ప్లానింగ్ అధికారులు, పోలీసులు స్పందించి రోడ్డుపై నిర్వహిస్తున్న దుకాణాలను తొలగించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.



డైమండ్ పార్కు ఎదురు రోడ్డులో టేబుల్స్ వేసిన వ్యాపారం చేస్తున్న దృశ్యం

అడ్డదిడ్డ పార్కింగ్‌తో అవస్థలు

సీతమ్మధార: జీవీఎంసీ నుంచి ద్వారకానగర్ వెళ్లే మార్గంలో ప్రైవేట్ బస్సులు నిలిపివేస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రహదారిలో ఎక్కువ భాగంగా ఈ బస్సులు ఆక్రమించుకోవటం వల్ల వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీకాకుళం, విజయనగరంతో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన ప్రైవేట్ బస్సులను ఈ రోడ్డులో నిలిపివేస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు వచ్చిన బస్సులు మూడు గంటల వరకు తిరిగి వెళ్లటంలేదు. ఇచ్ఛాపురం, కవిటి, మందస, టెక్కలి, పార్వతీపురం నుంచి విశాఖకు ప్రైవేట్ బస్సులు నడుస్తున్నాయి. ఈ బస్సులు రహదారిపైనే నిలిపేస్తుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.



వైఎస్సార్ పార్కు రోడ్డులో నిలిపివేసిన ప్రైవేట్ బస్సులు

భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి



ఏసీపీ ఝాన్సీలక్ష్మి

జగదాంబ: భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని జీవీఎంసీ జోన్–4 టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ కమిషనర్ ఝాన్సీలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె జోనల్ కార్యాలయంలో మాట్లాడుతూ జోన్ పరిధిలో కొత్తగా భవనాలు నిర్మాణాలు చేపడుతున్న వారందరూ తప్పనిసరిగా జీవీఎంసీ అనుమతులు తీసుకోవాలన్నారు. అదే విధంగా నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలన్నారు. అదనంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వంద గజాలలోపు నిర్మాణాలకు కూడా ప్లాన్ తప్పనిసరి అన్నారు. అనుమతులు పొందిన యాజమానులు జీవీఎంసీ కాలువలు, రహదారులపై నిర్మాణాలు చేయకూడదన్నారు. వన్‌టౌన్ రహదారి వెడల్పునకు సంబంధించి అన్ని పనులు పూర్తి చేశామన్నారు. భవన యాజమానులు సహకరించడంతో పనులు సులభతరం అయ్యాయన్నారు. అలాగే భవన యాజమానులు నిర్మాణాల సమయంలో వ్యర్థాలను రహదారిపై వేయకూడదన్నారు. దీని వలన పారిశుధ్య పనులకు ఆటంకం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది విశ్వనాథం, పవన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ కోర్సులను పునరుద్ధరించాలి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో హ్యూమన్ రైట్స్ కోర్సులను పునరుద్ధరించాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ కోరారు. మంగళవారం ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య కె.సీతామాణిక్యంను కార్యాలయంలో కలిసి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రెండు దశాబ్దాల క్రితం నుంచి ఏయూలో ఈ కోర్సుల నిర్వహణ జరుగుతోందని, వీటిని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గిరి మహిళకు అండగా..

సత్వరం వైద్యం చేయాలని ఆదేశించిన ఎంపీ డాక్టర్ తనూజారాణి



గిరిజన మహిళ మర్రి గాసమ్మ

మహారాణిపేట: విశాఖ కేజీహెచ్‌లో 13 రోజులుగా వైద్యం అందక అవస్థ పడుతున్న గిరిజన మహిళకు అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ గుమ్మా తనూజారాణి అండగా నిలిచారు. అరకులోని పెదబయలు మండలం పెదకోడాపల్లి పంచాయతీలోని పెదగొంది గ్రామానికి చెందిన మర్రి గాసమ్మ (34) ఈనెల 12న చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌లో చేరింది. నేటికి 13 రోజులు కావస్తున్నా ఇప్పటికీ ఆమెకు ఎలాంటి వైద్యం అందలేదు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ తనూజారాణి స్పందించారు. ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న ఆమె కేజీహెచ్ వర్గాలతో చరవాణి ద్వారా మాట్లాడారు. రోగి సమస్యను వారికి వివరించారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపీ ఆదేశించడంతో తక్షణం వైద్యులు స్పందించారు. గురువారం శస్త్ర చికిత్స చేయడానికి కేజీహెచ్ వైద్యులు అంగీకరించడంతో వారిని ఎంపీ తనూజారాణి అభినందించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

దాబాగార్డెన్స్: జాతీయ రహదారి షీలానగర్ శ్రీనివాస కల్యాణ వేదిక కల్యాణ మండపంలో శ్రీహరి సేవ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్. అప్పారావు నేతృత్వంలో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళధ్వని వేద మంత్రాలతో వైఖానస ఆగమ సాంప్రదాయంలో టౌన్ కొత్తరోడ్డులో ఉన్న జగన్నాథ స్వామి ఆలయ అర్చకులు పి. రంగనాథాచార్యుల బృందం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపించారు. కల్యాణ వేదిక అధినేత టి. సుధాకర్‌రెడ్డి, రామ నిర్మల దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ కల్యాణోత్సవానికి చేసిన వ్యాఖ్యానం ప్రత్యేకతను సంతరించుకుంది. భక్తి సంగీత సేవా సంస్థ శృతిలయ అధ్యక్షుడు వి. ప్రభాకర్ బృందం ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు భక్తిభావాన్ని కలిగించాయి. 2 వేల మంది శ్రీవారి సేవకులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వీ సత్యనారాయణ, ఎమ్మెస్ మాధవ్, కొణతాల రాజు, నగరానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న రంగనాథాచార్యుల బృందం

పేరుకుపోయిన చెత్తతో ఇక్కట్లు

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డులోని శ్రీనగర్, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో చెత్త పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తోందని స్థానికులు వాపోతున్నారు. వార్డులోని చెత్త కుళ్లిపోవడంతో ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందంటున్నారు. అలాగే డ్రైనేజీల్లో ప్లాస్టిక్ బాటిళ్లతో పాటు చెత్త, కవర్లు నిండిపోయి నీరు ముందుకు పారటం లేదని తెలిపారు. దోమలు స్వైరవిహారం చేయటం వల్ల జ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు దీనిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



శ్రీనగర్‌లో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

కూలిన చెట్టుకు పునరుజ్జీవం

కేజీహెచ్‌లో అరుదైన ఘటన



జేసీబీ సహాయంతో చెట్టును యథాస్థానంలో నిలబెడుతున్న దృశ్యం



చెట్టుకు ఫంగల్ చికిత్స, న్యూట్రిషన్ ట్రీట్‌మెంట్ చేస్తున్న నిపుణులు

మహారాణిపేట: ఇటీవల కురిసిన వర్షాలకు కేజీహెచ్‌లో నేలకొరిగిన మహా వృక్షానికి మంగళవారం పునర్జీవం కల్పించారు. ఆస్పత్రిలోని పార్కింగ్ ఆవరణలో గల 25 అడుగుల ఎత్తున్న బాదం చెట్టు వేళ్లతో సహా నేలకొరిగింది. అలా పడిన చెట్టును నరికేయకుండా తిరిగి యథాతథంగా నిలబెట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పదుగురికీ ఉపయోగపడే ఆ చెట్టును నరికి పడేయకుండా తిరిగి నిలబెట్టేందుకు సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ చర్యలు చేపట్టారు. ఆ చెట్టులో కొన్ని కొమ్మలు తొలగించి, చెట్టు మానులో కూడా కొంత భాగాన్ని తొలగించి ఫంగల్ చికిత్స చేశారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన క్లైమేట్ ఫ్రంట్ అనే సంస్థ సహకారం తీసుకున్నారు. జేసీబీ సహాయంతో చెట్టు పడిన ప్రాంతానికి 50 మీటర్ల దూరంలోని వేరే స్థలంలో తిరిగి నాటారు. వర్షాలకు పడిపోయిన చెట్టుకు ఫంగల్ చికిత్స, న్యూట్రిషన్ ట్రీట్‌మెంటు చేయటం వల్ల చెట్టు చిగురించి బతుకుందని క్లైమేట్ ఫ్రంట్ ప్రతినిధి భట్టాచార్య తెలిపారు. గతంలో కాకినాడలో ఓఎస్‌టీఎస్ అనే సంస్థ ద్వారా అక్కడి వైద్య కళాశాలలో కూడా పడిపోయిన చెట్టును తిరిగి పునర్జీవింపజేసినట్లు కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాస్ కుమార్ తెలిపారు. కేజీహెచ్ ఏఆర్ఎంవో డాక్టర్ దవళ భాస్కర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు లోకనాథ్, మేనేజర్ జె.ఎం.జవహర్ తదితరులు పాల్గొన్నారు.



నాటిన తర్వాత ఠీవిగా నిల్చున్న బాదం చెట్టు

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం



పందుపుల్లల సందు వద్ద చెత్త ఎత్తిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

జగదాంబ: పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా పని చేయాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.రాజేష్ అన్నారు. మంగళవారం జోన్ పరిధిలోని 35వ వార్డులో గల పందుపుల్లల సందు, వన్‌టౌన్ ప్రధాన రహదారి, పూర్ణామార్కెట్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారి పక్కనున్న చెత్తకుప్పలను ఎత్తించారు. వార్డులో రహదారులు, కాలువలు పరిశుభ్రంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు లేకుండా పరిశుభ్రం చేయాలన్నారు. మార్కెట్‌లో ప్రతి దుకాణం వద్ద మూడు రకాల చెత్త డబ్బాలు పెట్టుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆ దుకాణదారుల నుంచి అపరాధ రుసుం విధించాలని కార్యదర్శులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.